మహిమాన్వితుడు రామలింగేశ్వరుడు

- బ్రహ్మోత్సవాలకు రామలింగేశ్వరుని ఆలయం ముస్తాబు
- నేటి నుంచి స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు
- ఆలయానికి విద్యుత్ దీప తోరణాలు
- 16 నుంచి 23 వరకు ఉత్సవాలు



కల్యాణ బ్రహ్మోత్సవాలకు విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో) పూజలందుకుంటున్న శ్రీరామలింగేశ్వరస్వామి



మచిలీపట్నంటౌన్: మహిమాన్వితుడు రామలింగేశ్వరుడి ఆలయం కల్యాణ బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసియున్న శ్రీపర్వత వర్ధిని, రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం కల్యాణ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 16 ఆదివారం నుంచి 23వ తేదీ ఆదివారం వరకు వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 16వ తేదీ ఉదయం స్వామి వారిని పెండ్లికుమారుడిగా చేయనున్నారు. 17 సాయంత్రం ధ్వజపట ఊరేగింపు, 19వ రాత్రి 7 గంటలకు జగజ్జ్యోతి, 20వ తేదీ రాత్రి ఎదుర్కోలు ఉత్సవం, స్వామివార్ల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 21వ తేదీ స్వామివారి రథోత్సవం నగర వీధుల్లో కనుల పండువగా సాగనుంది. 22వ తేదీ ఉదయం అవభృదస్నానం, వసంతోత్సవం, సాయంత్రం నంది వాహనుడైన స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహిస్తారు. 23వ తేదీ రాత్రి స్వామివార్లకు పుష్పోత్సవం జరగనుంది. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రతిరోజూ సుహాసినీలు శ్రీలలితా సహస్రనామ పారాయణం చేయనున్నారు. ప్రతిరోజూ రాత్రి ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన నిర్వహించనున్నారు. 16న కూచిపూడి నృత్యప్రదర్శన, 17న పార్వతీ కల్యాణం హరికథ, 18న చింతామణి నాటకం ప్రణయ ఘట్టం సీన్, 19న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం, సిద్ధుడు, 21న శ్రీరామాంజనేయ యుద్ధం నుంచి వార్ సీన్, 22న సక్కుబాయి నాటకం నుంచి తిరగలి సీన్, 23న భక్తి సంగీత విభావరి నిర్వహించనున్నారు.

ఆలయ విశిష్టత ఇది

శ్రీరామలింగేశ్వరస్వామి కృతయుగంలో అగస్త్య మహర్షితో ప్రతిష్ఠించబడినట్లు చెబుతున్నారు. దాదాపు 400 సంవత్సరాల క్రితం ఈ ఆలయాన్ని అర్చకుడైన కందుకూరి సూర్యనారాయణశర్మ స్వప్నాన తాను వాల్మీక గర్భంలో ఉన్నానని తీసి పునఃప్రతిష్ఠ చేయాలని ఆజ్ఞాపించగా ఆ ప్రదేశంలో తవ్వగా స్వామివారి మూలవిరాట్ లింగ రూపంలో దర్శనమిచ్చింది. అప్పటి బ్రిటీష్ అధికారి రాబర్ట్‌సన్ దొర ప్రోత్సాహంతో ఆలయ నిర్మాణంతో పాటు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీ వీరభద్రస్వామి, శ్రీ కాలభైరవస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయం బౌద్ధుల కాలమందు ప్రసిద్ధి చెందినట్లు స్థలపురాణం ద్వారా తెలుస్తోంది. స్వామివారు శ్రీరాజరాజేశ్వరి సమేతుడై ప్రసిద్ధికెక్కారు. ఆలయంలో దక్షిణ భాగాన ధ్యానముద్రలో ఉన్న 35 అడుగుల శ్రీ పరమశివుని విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. స్వామివారి విగ్రహంతో పాటు ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. ఈ మహా విగ్రహాన్ని 2014 ఫిబ్రవరి 24న పుష్పగిరి పీఠాధిపతి శ్రీ మదభినవోద్దండ విద్యాన్నృసింహ భారతీస్వామి మహాకుంభాభిషేకం నిర్వహించి ఆవిష్కరించారు.



ఆలయ ప్రాంగణంలోని మహాశివుని విగ్రహం

అన్ని ఏర్పాట్లు చేశాం



ఆలయంలో నేటి నుంచి ప్రారంభమయ్యే స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలి. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం. మచిలీపట్నంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి స్వామి, అమ్మవార్ల అనుగ్రహం పొందాలి.

–బి.సుబ్బారెడ్డి, కార్యనిర్వహణాధికారి

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు దుస్తులు, సర్టిఫికెట్లు అందిస్తున్న సర్పంచ్ ఉమ, సూపర్‌వైజర్ విశ్రాంతమ్మ



పఠాన్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



ఘంటసాల నందం బజార్ అంగన్‌వాడీ కేంద్రంలో ..

చల్లపల్లి(అవనిగడ్డ): మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. రామానగరం, వక్కలగడ్డ అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమంలో వక్కలగడ్డ సర్పంచ్ వల్లూరి ఉమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశ్రాంతమ్మ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలలో చేరే చిన్నారులకు దుస్తులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివిస్తే ఒత్తిడి లేని విద్య, ఖర్చులేని చదువు అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది పరిశె సరస్వతి, హెచ్‌ఎం దుర్గారాణితో పాటు పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు పఠాన్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ బాటలో భాగంగా పఠాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఐసీడీఎస్ బందరు సీడీపీఓ కె.గ్లోరీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించి ప్రాథమిక పాఠశాలలకు పంపిస్తారన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చడం ద్వారా పోషకాహారం అందిస్తూ ఆటపాటలతో కూడిన విద్యాబోధన జరుగుతుందన్నారు. దీంతో విద్యార్థుల్లో శారీరకంగా, మానసికంగా చక్కటి ఎదుగుదల కనిపిస్తుందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.ఉషశ్రీ, కార్యకర్తలు పి.రెజీనారాణి, వి.కస్తూరి బాయి, పి.వెంకటేశ్వరమ్మ, జి.నాగమణి, బి.భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న విద్య, పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ఘంటసాల సెక్టార్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి అన్నారు. ఘంటసాల నందం బజారులోని అంగన్ వాడీ కేంద్రంలో పంచాయతీ పరిధిలోని 9 అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు నిండిన 15 మంది చిన్నారులకు గ్రాడ్యుయేషన్ నిర్వహించి స్థానిక మండల పరిషత్ ప్రాథమిక (బాలుర) పాఠశాలలో జాయిన్ అవ్వగా, ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 సంవత్సరాలు దాటిన 10 మంది చిన్నారులు చేరారు. లంకపల్లి, దాలిపర్రు పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 15 మంది చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించగా శ్రీకాకుళం సెక్టార్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మేరీ ఆధ్వర్యంలో జరిగింది. ఆయా కార్యక్రమాల్లో ఘంటసాల, లంకపల్లి, దాలిపర్రు పంచాయతీల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బలే పద్మ, యనిగళ్ల సునీత, యా.కోటేశ్వరమ్మ, కె.నాగలక్ష్మి, ఆర్.రుక్మిణి, కె.పద్మావతి, పి.పద్మలక్ష్మి, కె.స్వర్ణ రాణి, జీవీ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూన్‌లో.. మే పుష్పం



మోపిదేవి: తహసీల్దార్ కార్యాలయంలో మే పుష్పం వికసించి పలువురిని అబ్బుర పరచింది. ఏటా మే నెలలోనే వికసించే ఈ పారిజాతాలు ఆలస్యంగా జూన్ నెలలో పుష్పించాయి. ముచ్చటగా మూడు పుష్పాలు వికసించి చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

బస్టాండ్‌లో షాపుల వేలం

అవనిగడ్డ: అవనిగడ్డ ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండ్‌లో ఉన్న షాపులకు వేలం పాట నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ బస్ స్టేషన్‌లో పలు వ్యాపారాల కోసం ఖాళీ స్థలాలు, ఫ్రూట్స్ అండ్ జ్యూస్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, ఫ్రూట్స్ అండ్ ఫ్రూట్ జ్యూస్, బస్ స్టేషన్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో ఏదైనా అనుమతించిన వ్యాపారం, చల్లపల్లి బస్టాండ్‌లో టీ అండ్ సమోసా, రెండు గోడౌన్లు, రెండు ఖాళీ స్థలాలు, ఎలక్ట్రికల్, పెయింట్స్, నాగాయలంకలో ఒక షాపు, మొవ్వలో సైకిల్ అండ్ స్కూటర్ స్టాండ్, పలు వ్యాపారాల కోసం నాలుగు ఖాళీ స్థలాలు, కూచిపూడిలో పలు వ్యాపారాలకు నాలుగు ఖాళీ స్థలాలు, మోపిదేవిలో రెండు స్థలాలను వ్యాపారాల కోసం వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈ నెల 15వ తేదీ నుంచి 27వ తేదీ మధ్య టెండర్ ఫారాలు అందుబాటులో ఉంటాయని, 28న మచిలీపట్నంలో జరిగే టెండర్ల ప్రక్రియలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని డీఎం సూచించారు. మరిన్ని వివరాలకు 73828 96721 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

70వసారి రక్తదానం



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లికి చెందిన స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్త కస్తూరి విజయ్‌కుమార్ 70వసారి రక్తదానం చేశారు. మచిలీపట్నంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఘంటసాల మండలం జీలుగలగండికి చెందిన గర్భిణికి అత్యవసరంగా రక్తం అవసరమవ్వగా విషయం తెలుసుకున్న విజయ్‌కుమార్ మచిలీపట్నం వెళ్లి రక్తం ఇచ్చి వచ్చారు. 70వసారి రక్తదానం చేసిన విజయ్ కుమార్‌ను పలువురు అభినందించారు.

అభినందన



పెడన: పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి భర్త మాజీ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ కటకం ప్రసాద్ శనివారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఎమ్మెల్యే కాగితకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు. ఆయనతో పాటు పెడన శివాలయం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, హేమలత కలంకారీ రీబిక్స్ ప్రొప్రయిటర్ మెట్ల దుర్గా నాగేశ్వరరావు (చిన్న), బొమ్మిడి ప్రసాద్, కటకం నాగకుమార్ తదితరులున్నారు.

మజ్జిగ పంపిణీ



మోపిదేవి: మోపిదేవి ప్రధాన గుడిసెంటర్‌లో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. పూర్వ సంఘం ప్రతినిధులు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఘటం ఊరేగింపు

నేడు పోతురాజుస్వామి జాతర

రేమాలవారిపాలెం(నాగాయలంక): గ్రామంలోని శ్రీపోతురాజుస్వామి దేవస్థానంలో వార్షిక జాతర మహోత్సవం శనివారం కోలాహలంగా ప్రారంభమైంది. స్వామివారి ఘటాన్ని నాగాయలంక కృష్ణానదిలో జాతర సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయ పూజారులు శుద్ధిచేసి ప్రత్యేక క్రతువు జరిపారు. తొలుత గతేడాది జాతర అనంతరం భద్రపర్చిన ఘటాన్ని బయటకు తీసి కృష్ణానదికి తరలి వెళ్లారు. అక్కడ నదీజలాలతో శుద్ధి చేసి జాతర ఆచారాల ప్రకారం పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో దీక్ష చేపట్టిన యువకులు తలపై ఆ ఘటాన్ని ధరించి ఊరేగింపు అగ్రభాగాన సాగగా డప్పు నృత్యాలు, మేళతాళాలతో నాగాయలంక ప్రధాన వీధుల మీదుగా గ్రామానికి చేరుకుని జల్దిలో ఉంచారు. తర్వాత ఘటాలకు గ్రామోత్సవం చేశారు. ఆదివారం తెల్లవారుజామునకు ఘటం గుడికి చేరుకోవడంతో జాతర ఆచారవంతులతో గుడిజాతర (సంబరం) ఆరంభమవుతుందని తదుపరి.. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకుంటారని నిర్వాహక కమిటీ ప్రతినిధులు చెప్పారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.



పోతురాజు ఘటంతో ఊరేగింపుగా గ్రామానికి వెళ్తున్న దీక్షాధారులు

అంకితభావంతో విధి నిర్వహణ

నాగాయలంక: ప్రహ్లాదబాబు అంకితభావంతో విధులు నిర్వహించారని ఉపాధ్యాయులు కొనియాడారు. పాఠశాల విద్యా కుటుంబం ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో సైన్స్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసిన చోడిశెట్టి ప్రహ్లాదబాబును శనివారం పాఠశాలలో జరిగిన వీడ్కోలు అభినందన సభలో ఘనంగా సన్మానించారు. మూడు దశాబ్దాలకు పైగా సైన్స్, లెక్కలు మాస్టారుగా అంకితభావంతో విధి నిర్వహణ చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల అభిమానం చూరగొన్నారు. గత నెల 31న ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో శనివారం పాఠశాల హెచ్‌ఎం వనమా రామకృష్ణ అధ్యక్షతన అభినందన సభ జరిగింది. ప్రహ్లాద దంపతులను ఉపాధ్యాయులు తొలుత సన్మానించారు. పాఠశాల విశ్రాంత హెచ్‌ఎం పీవీ నాగేశ్వరరావు, పీడీ గాజుల లక్ష్మీప్రసాద్, పద్యాల రఘురామయ్య, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.



ప్రహ్లాదబాబు దంపతులను సన్మానించిన పాఠశాల ఉపాధ్యాయులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీఆర్‌కే

చల్లపల్లి(అవనిగడ్డ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ చెప్పారు. స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహం ఎదుట మన కోసం మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డాక్టర్ డీఆర్‌కేసాద్, డాక్టర్ పద్మావతి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ డీఆర్‌కే వర్షాకాలం ఆరంభంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు, ఖాళీ స్థలాల్లో నీడనిచ్చే మొక్కలు, ఫలాలను ఇచ్చే వృక్షాలను పెంచుకోవాలని హితవు పలికారు. కలుషితం లేని గాలి, నీడ, కాలుష్యం లేని ఫలాలు పొందవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు వసతిగృహ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డాక్టర్ డీఆర్‌కే దంపతులు

'కాగిత'ను కలిసిన రెవెన్యూ అధికారులు



కాగిత కృష్ణప్రసాద్‌ను సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న తహసీల్దార్ శాంతి

గూడూరు: పెడన ఎమ్మెల్యేగా గెలిచిన కాగిత కృష్ణప్రసాద్‌ను శనివారం గూడూరు మండల రెవెన్యూ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. నాగేశ్వరరావు పేటలోని కృష్ణప్రసాద్ నివాసంలో కలిసిన తహసీల్దార్ ఎస్.ఎస్.శాంతి, డిప్యూటీ తహసీల్దార్ వై.శివశంకర్, ఆర్ఐ నస్రీన్ ఆరా, వీఆర్వోలు జ్ఞాపికను అందించి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్వో సంఘ నాయకులు కాకుశేశ్వరరావు, బషీర్, వరప్రసాద్, ఉషారాణి, వెంకటేశ్వరరావు, నరేష్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో భూసారం మెండు

డీఆర్‌సీ ఏడీఏ కొర్రపాటి శ్రీనివాసరావు

గుడివాడరూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంట పొలాలకు భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైరు వల్ల చాలా ఉపయోగాలు ఉంటాయని డీఆర్‌సీ ఏడీఏ కొర్రపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరు గ్రామంలో రైతులు పంట పొలాల్లో సాగు చేసిన పచ్చిరొట్ట పంటను గుడివాడ వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, ఏవో పద్మజ, ఎంఏవో బోలెం అనంతలక్ష్మితో కలసి ఆయన పరిశీలించారు. పచ్చిరొట్ట పంటతో పొలాలకు కలిగే ప్రయోజనాలు, ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మరికొద్దిరోజుల్లో ఖరీఫ్ సాగు మొదలుకానున్న నేపథ్యంలో పచ్చిరొట్ట పంటను పంట పొలాల్లో ఎరువుగా వినియోగిస్తే భూసారం పెరగడంతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయని రైతులకు వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ విధానాన్ని అవలంభించడంతో దిగుబడులు చాలా పెరుగుతాయన్నారు. సాగులో ఏమైనా సందేహాలు, సమస్యలు ఉంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, బొమ్ములూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.



విద్యాకానుక కిట్ల పంపిణీ

గూడూరు: కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతిలు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



'పీఎంశ్రీ'గా బంటుమిల్లి జెడ్పీహెచ్ఎస్

బంటుమిల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల(జెడ్పీహెచ్ఎస్)ను కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలగా ఎంపిక చేసిందని హెచ్‌ఎం బీవీ వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడానికి పీఎంశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరం నుంచి పాఠశాలలో కంప్యూటర్, ఎలక్ట్రానిక్ విద్యాబోధన 8,9 తరగతుల విద్యార్థులకు అందుతుందని హెచ్‌ఎం తెలిపారు. దీని కోసం ఇద్దరు కంప్యూటర్ ఉపాధ్యాయులను నియమించినట్లు ఆయన చెప్పారు. విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ కూడా ప్రారంభిస్తున్నట్లు వెంకట్రావు తెలిపారు. విద్యార్థులు జిల్లా పరిషత్ పాఠశాలలో చేరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎన్ఎమ్ఎమ్ స్కాలర్ షిప్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

నున్న(విజయవాడరూరల్): కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పొందడానికి నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు యలమర్తి సెల్వసాగర్, బాణావతు జోసెఫ్‌రాజు, పెద్దింటి యుగవెంకట శివనాగ సాయి స్కాలర్‌షిప్ పొందడానికి జరిగిన పోటీ పరీక్షల్లో ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు కృష్ణాజిల్లా, మొవ్వ మండలం, పెదముత్తేవి గ్రామ కాపురస్తులు **లింగమనేని ఉమామహేశ్వరరావు గారి కుమారుడు సత్యనారాయణ** గారి సంజాయిషీ మేర ఇచ్చు ప్రకటన.

నా క్లయింటు యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని కృష్ణాజిల్లా, గూడూరు మండలం, తరకటూరు గ్రామ కాపురస్తులు అయిన (1) బాదర్ల రాజ్యలక్ష్మి W/o. యర్రపోతు (లేటు) కోటేశ్వరరావు, వీరి కుమార్తె (2) యర్రపోతు భవ్య మరియు కుమారుడు (3) యర్రపోతు ఈశ్వర్ మణికంఠ సాయి గార్ల వద్ద నుండి కొనుగోలు చేయు నిమిత్తమై ఒప్పందం కుదుర్చుకొని యున్నారు. సదరాస్తి 1వ వారి భర్త గారున్నూ, 2, 3 వార్లకు తండ్రిగారున్నూ అయిన యర్రపోతు కోటేశ్వరరావు గారు, వీరి కుటుంబ సభ్యులు కలిసి ది. 11-05-2000న వ్రాసికున్న అన్‌రిజిష్టర్ పార్టీషన్ డీడ్ మరియు 1వ వారికి మామగారున్నూ, మరియు 2, 3 వార్లకు తాతగారున్నూ అయిన యర్రపోతు వెంకటేశ్వరరావు గారు మరియు వీరి సోదరులకు వీరి తండ్రిగారైన రామచంద్రయ్య గారు. ది. 18-04-1996న అన్‌రిజిష్టర్ వీలునామా ద్వారా సంక్రమించిన ఆస్తి అయివున్నది. దర్మిలా సదరు వెంకటేశ్వరరావు గారి కుమారుడు కోటేశ్వరరావు వీరి సోదరసోదరీలపై మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో O.S. No. 366/2009 రుగా ది. 11-05-2000న వ్రాసికున్న పార్టీషన్ లిస్టుపై "ఇంజక్షను ఆర్డరు నిమిత్తం దావా వేసియున్నారు. పిమ్మట ది. 15-02-2016న లోక్ అదాలత్ కేసు నెం. 221/2016రుగా రాజీ పడి సదరు షెడ్యూలు ఆస్తి బాదర్ల రాజ్యలక్ష్మి W/o. యర్రపోతు కోటేశ్వరరావు గారిదిగా అవార్డు పొందియున్నారు. సదరాస్తి యర్రపోతు రామచంద్రయ్య గారు ది. 03-06-1992న దేవత (లేటు) పుల్లయ్య గారి కుమార్తె వెంకట రామకృష్ణారావు వగైరాల వద్ద నుండి క్రయ దస్తావేజు నెం. 1425/1992రుగా పొందియున్నారు. దర్మిలా సదరు రామచంద్రయ్య గారు ది. 27-05-1996న ఇంటెస్టేటుగా మరణించినారు. దర్మిలా పైన తెలిపిన వీలునామాలో వీరి 2వ కుమారుడైన వెంకటేశ్వరరావు గారి ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన వారసత్వపు హక్కులు గానీ, ఇతరత్రా ఏవిధమైన అభ్యంతరాలు గానీ వున్న యెడల 7 రోజులలోపు తెలుపగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోనబడవు.

షెడ్యూలు : కృష్ణాజిల్లా, గూడూరు మండలం, తరకటూరు గ్రామం, రీసర్వే నెం. 295రు లో య॥4.35 సెంట్లలో య. 1-54 సెంట్లకు హద్దులు. **తూర్పు :** యర్రపోతుల వెంకట సుబ్బారావు గారి భూమి, **దక్షిణం :** రామచంద్రయ్య గారి అనంతరం శీతయ్య, వెంకటసుబ్బారావు గార్లకు చెందు భూమి, **పడమర :** యర్రపోతు వెంకట సుబ్బారావు గారి భూమి, **ఉత్తరం :** రోడ్డు.

మచిలీపట్నం — చినుమర్తి సూర్యప్రకాష్, న్యాయవాది
ది. 15-6-24 — ఫోన్ : 98661 27503

ఆర్‌బీకేల్లో అందిస్తున్న వరి విత్తనాలను వినియోగించుకోండి

ఏవో కె.మురళీ కృష్ణ

ఘంటసాల: వ్యవసాయ శాఖ ద్వారా రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్న వరి విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి కె.మురళీకృష్ణ అన్నారు. ఘంటసాల గ్రామ సచివాలయం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులకు సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఏవో మురళీ కృష్ణ, ఈవో జయలక్ష్మి చేతుల మీదగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవోమురళీ కృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎంటీయూ – 1061, బీపీటీ – 5204, ఎంటీయూ – 1318, ఎంటీయూ – 1224 అనే నాలుగు రకాల వరి వంగడాలను రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 184 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కావల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లతో రైతుభరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 30 కేజీల బస్తాలు సబ్సిడీ పోనూ రూ.1044లకు, ఎంటీయూ 1224 30 కేజీల బస్తా రూ.1104లు, బీపీటీ 5204 30 కేజీల బస్తా సబ్సిడీ పోనూ రూ.920 చెల్లించి వరి విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు ఏవో మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండి పరాత్పరరావు, రైతులు కాకుమాని రంగారావు, వెంకటేశ్వరరావు, అయినపూడి కోటయ్య, వీఏఏ జి.రేవతి, రైతులు పాల్గొన్నారు.



ఘంటసాలలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, ఏవో మురళీకృష్ణ

సాధారణ బహిరంగ ప్రకటన

... సాధారణ ప్రజలకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, CNR ఆక్వా ఎంటర్‌ప్రైజెస్ మరియు దాని యజమాని శ్రీ బల్లె జయరాజు, S/o గుంటయ్య, వయస్సు సుమారు 41 సంవత్సరాలు, నివాసం : డి.నం.6-194/1, మోడి గ్రామం, కాళ్ల మండలం, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534201 వారు రూ.5,13,46,130/- (అక్షరాల ఐదు కోట్ల పదమూడు లక్షల నలభై ఆరు వేల నూట ముప్పై రూపాయలు మాత్రమే) లకు వ్యతిరేకంగా మా క్లైంటు తీర్పు పొందిన కారణంగా, గౌరవనీయులైన 34వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, బెంగుళూరు, మేయో హాల్ యూనిట్, శ్రీ బల్లె జయరాజుకు వ్యతిరేకంగా అరెస్టు వారెంట్‌లను కూడా జారీ చేసింది. ఏ వ్యక్తి అయినా అతని స్థానం మరియు ఆచూకీ గురించి అవగాహన కలిగి ఉన్నట్లయితే, దిగువ సంతకం చేసిన వ్యక్తికి ... తెలియజేయవలసి ఉంటుంది. పై తీర్పు అనుగుణంగా శ్రీ బల్లె జయరాజుకు చెందిన ఏదైనా ఆస్తి దిగువ సంతకం చేసిన వారికి తెలియజేయవలసిందిగా మేము సాధారణ ప్రజలను కూడా కోరుతున్నాము. సమాచారం ఇచ్చేవారికి తగిన రివార్డు ఉంటుంది.

శ్రీ గుంజల వెంకట నాగరాజు, తండ్రి : రాముస్వామి, వయస్సు సుమారు 47 సంవత్సరాలు, నివాసం : డి.నెం.29/170-189-4ఎ, ఇనగూడూరు పేట, మచిలీపట్నం మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ వారు మా క్లయింట్‌కు అనుకూలంగా, టైటిల్ డీడ్ డిపాజిట్ ద్వారా, R.Sలో 2069 చదరపు గజాల (501.666 చ.గజాలు + 1577.333 చదరపు గజాలు) ఆస్తి నం.101, డి.నం.29/170-98, ఇనగూడూరుపేట, అమృతపురం, బాదరు తూర్పు, రెవెన్యూ వార్డ్ నం.1, మచిలీపట్నం మున్సిపల్ పరిధిలో, మచిలీపట్నం SROలో, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఆస్తి నా క్లయింట్‌కు తనఖా పెట్టబడినందున దానికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరుపకూడదని లేదా ఏ విధమైన లావాదేవీలు చేయవద్దని మేము సాధారణ ప్రజలను హెచ్చరిస్తున్నాము.

ఇట్లు/నమూనా :
మెస్సర్స్ వెంకటేష్, అమర్‌నాథ్ & కో.,
న్యాయవాదులు,
నెం.432, 1వ అంతస్తు, 12వ క్రాస్,
సదాశివనగర్, బెంగుళూరు- 560 080
ఫోన్:+ 91-9886140745, + 91-9738129600